
పచ్చని వెన్నెల



సోమేపల్లి వెంకటసుబ్బయ్య

పచ్చని వెన్నెల

నానీలు

సోమేపల్లి వెంకటసుబ్బయ్య

క్రిసెంట్ పబ్లికేషన్స్
విజయవాడ - 520 002

పచ్చని వెన్నెల

PACHANI VENNELA

By

SOMEPALLI VENKATA SUBBAIAH

First Edition: October, 2007
Copies: 1,000

Cover Design:
GIRIDHAR

Price: Rs. **30/-**

For Copies:
CRESCENT PUBLICATIONS
29-25-43A, Vemuri Vari Street
Suryarao Pet
Vijayawada - 520 002

Printed at:
RATNA PRINTING WORKS
29-25-43A, Vemuri Vari Street
Suryarao Pet
Vijayawada - 520 002
Ph: 0866 - 6662666 / 6663666

చిన్నారులు

శ్రీ వశిష్ఠకి,

శ్రీ విశ్వనాథ విరించికీ...

అంకితం

నానీలతో మూడో అడుగు

ఇది నా ఆరో పుస్తకం.

"లోయలో మనిషి", "తొలకరి చినుకులు", "చల్లకవ్వం", "రెప్పల చప్పుడు", "తదేకగీతం"... గతంలో ప్రచురించిన అయిదు పుస్తకాలు.

నానీల్లో "తొలకరి చినుకులు", "రెప్పల చప్పుడు" పుస్తకాల తర్వాత ఇప్పుడు ఈ "పచ్చని వెన్నెల".

మొదటి నానీల పుస్తకం "తొలకరి చినుకులు" తర్వాత కూడా నానీల దాహం తీరలేదు. మరో వంద నానీలతో "రెప్పల చప్పుడు" పుస్తకం ప్రచురించాను. ఇప్పుడు "పచ్చని వెన్నెల" నానీలతో మీ ముందుకు వచ్చాను. "పచ్చని వెన్నెల"లోని దాదాపు అన్ని నానీలూ అనుభవంలో నుంచి వచ్చినవే.

ప్రతిరోజు ఎదురయ్యే దృశ్యాలు, సంఘటనలూ ఈ నానీలకు ప్రేరణ. భవిష్యత్‌లో మరో రెండు నానీలు పుస్తకాలు తేవాలనేది నా కోరిక. మొత్తం ఐదువందలు నానీలు రాశాక వాటిని అన్నింటిని కలిపి ఒకటే సంకలనం చేయాలనేది నా అభిలాష.

నేనంటూ –

నానీల ప్రపంచంలోకి అడుగు పెట్టడానికి ప్రేరణ అయిన "ఆచార్య ఎన్. గోపి" గారికి మిత్రులు "ఎస్. ఆర్. భల్లం" గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

అర్ధాంగి "విజయలక్ష్మి"కి ఆత్మీయతా ఆశీస్సులు.

పుస్తకాన్ని ముచ్చటగా ముద్రించి ఇచ్చిన "క్రిసెంట్ పబ్లికేషన్స్" వారికి నా కృతజ్ఞతలు.

– సోమేపల్లి వెంకటసుబ్బయ్య

దుక్కిదున్నే బాడుగెద్దులు
రెండుకాదు
మూడు
రైతుతో కలిసి

పల్లెల్లో
వేకువ సంగీతం ఇంపు
మూడు రోకళ్ళ
ఏకదంపుడు

పాడు బడిందా
మండువా లోగిలి
అనుబంధాలూ
అటకెక్కాయి

అతనో
కాలాతీతవ్యక్తి
అందరి సమయాన్నీ
ఆరగించే శక్తి

చేను ముఖం నిండా
చిరునవ్వు
విరగబడి విచ్చుకుంది
పత్తిపువ్వు

విత్తులోనూ
విప్లవముంది
కప్పెట్టినా
కత్తిలా మొలుచుకొస్తుంది

పండుటాకులు
వృద్ధాశ్రమంలో
తల్లిలాంటి భాష అంటూ
తెగతాపత్రయం...!?

ఎ.టి.ఎం. అంటే
ఎంతో ప్రేమ
అచ్చం
అలాంటి భార్య కావలెను

రేగటి చాళ్ళలో
నాగలి విరిగిందా
ఆకాశం
ఈ యేటి మేటి జూదరి

చితిమంటలకీ
చేతకాదు
"కవి" కీర్తిని
భస్మం చేయడం

జనానికే కాదు
జీవాలకీ అపార్ట్‌మెంట్లు
బహుళ అంతస్తుల
కోళ్ళఫారాలు

అల్లంత దూరాన
కమనీయ దృశ్యం
భూమి ఆకాశాల
ముద్దులకు భాష్యం

బతికినన్నాళ్ళూ
ఉప్పు నిప్పు
హమ్మయ్యా!
స్మశానంలో సహజీవనం

ప్రగతి వైపు
అడుగులు పడ్డప్పుడేగా
సేవకు
పునరంకిత గతి!?

వెండితెర నాయిక
ఏమిటటా!
అర్జంటుగా
వెయ్యాలి పైట

నరం
దారమై అల్లుకుందా
అందుకేనేమో
ఆ చెప్పు అంత గట్టి

పచ్చని చెట్లూ
ముత్తయిదువులే
రైలు కిటికీకి
ఎదురొస్తున్నాయి

చేయీ చేయీ
కలిపి చూడు
గుండెనూ తడుతుంది
చేను గట్టు

అంతా ఆధునికతే
"పంచీ"కరణ
మాయమై
ప్రపంచీకరణ...!

మెడవంచి
తాడుకట్టించుకుందనా
మూర్ఖుడా
పశువులా చూస్తున్నావ్!

దెబ్బేం తగల్లేదు
చెంపకీ చెవికీ
సెల్‌ఫోన్ ఆనించుకున్నాడు
అంతే...!?

పాత పంచాంగం
పరీక్షించి చూడు
సునామీ
ఎక్కడైనా నక్కిందేమో...

అరె! ఈ కొండ
కొంచెమై పోయిందే
సరిగ్గా
అద్దంలో అమిరేట్టుగా

నీళ్ళలోకి చూసి
ఏం లాభం
పెద్ద పెద్ద చేపలన్నీ
నేలమీదే వుంటే!

బ్రహ్మరాసిన రాత
కానేకాదు
నాగటి కర్రు
గీసిన గీత...!

మది నిండా
ఉగాది వూసులు
గది నిండా
సమస్యల రేసులు

పరిశోధన
గృహహింస చట్టంపైనా
గృహిణే గైడ్
ఇల్లే విశ్వవిద్యాలయం

ఊరందరి
ఆకలి తీర్చే అన్నం పళ్ళెం
నూర్పిడి చేసే
ధాన్యం కళ్ళం

బతుకు అటో ఇటో
తేలిపోవాలా
నమ్మింది భూమినా?
బూమ్‌నా?

నిద్ర
రేపటిదీ ఇవాళేనా
మరి భోజనం సంగతి
ఏమిటి?

ముందు నుయ్యి
వెనక నుయ్యి
జలం కోసమైతే
కసరత్తులు చెయ్యి

తెలుగుదనం
వెల్లివిరుస్తోందా
అయితే పల్లెలో
జీవమున్నట్టే

దరి చేరుస్తుందనుకుంటే
బల్లకట్టు
పాపం
కడతేర్చిందేం?

పశువులకూ
అంటరానితనమా
దళితవాడ నుంచి
దారి తప్పాయేమో...

ఆమనిలో
కోకిలలేవి...!
కవులే
ఇక కోకిలలేమోలే

కాలుష్య మేఘాన్ని
మధించకు
కాసులే కాదు
కాష్టాలూ మండుతాయి

యూజ్ అండ్ త్రో
ఇవాల్టి సంస్కృతి
పురోగమనంలో
వృద్ధాశ్రమాలేగతి

ఎ.సి. వేసినా
గదినిండా ఎండే
ప్రపంచీకరణ
మహిమేనా...!?

జీవితానికి
వ్యాఖ్యానమే కదా
సగానికి
మూయబడ్డ కిటికీ

పొలాలు అమ్మబడును
కొనబడును
రైతులు
కావలెను

రైలు
కూతేసిందా
ఆకలి పేగుల ఘోషలో
కలిసిపోయిందంతే

తెలుగుదనం
ఉట్టిపడుతోందా
అయితే
ఆ ఇల్లు ఉగాదికి ఊపిరే

రాశిని బట్టి
వాసి అయితే
బడుగులందరిదీ
ఒకటే రాశి అంటావా

ఉరుకులా
ఉగాది పచ్చడి కోసం
ఏ బ్రాండ్‌ది కావాలో
చెప్పరాదూ

అంతా ఆదాయమే
ఖర్చు చూపడంలేదు
కంప్యూటర్‌లో
కందాయఫలం

తట్టనిండా
కూరల దొంతరలు
చెట్లపాదులకే
నున కృతజ్ఞతలు

కుక్కలున్నాయి జాగ్రత్త
ఫర్వాలేదు
మనుషులున్నారేమో
అదే భయం

కాడికింద
జోడెద్దులు
కాపురందిద్దేదెలాగో
చూసి నేర్చుకో

అవును
వాళ్ళది హైటెక్ ప్రేమ
కలిపింది
ఎస్.ఎం.ఎస్. మరి

ఓ ప్రతీక
ప్రపంచీకరణకు
రంగురంగుల
ఫ్లెక్సీ బ్యానర్

గుండ్రంగా మేసి
వృత్తం గీసింది
బీడులో కట్టేసిన గేదెదే
కళాహృదయం...!

జలతారు రోడ్డు
పొరల మధ్య
"తారు" చీకట్లు కమ్ముకున్న
బాల్యం

గూడు వదిలిన
గువ్వలు కాదు
చదువుల పంజరంలో
బందీలు

అప్పుడప్పుడయినా
ఆమె
పుట్టినింటికి
శరణార్థి కదా!

పశువులది
నిర్భంధ డైటింగ్
చుట్టూ పచ్చగడ్డి
మూతికి చిక్కం

దారి పొడుగునా
టోల్‌గేట్లు
దాటాలంటే
కావాల్సిందే బిల్‌గేట్స్

మా చేనూ
"భారతీ"యమే
క్షేత్రం నిండా
రకరకాల సస్యాలే

కలుపు మొక్క
మనిషై మొలకెత్తిందా
పీకెయ్యడానికి
మందేదీ...!

అతీతమైంది
గూడ్సు రైలుబండి
అనుభవాలకూ
అనుబంధాలకూ

కనికరానికి
కాఠిన్య సమాధి
నిత్య పూజలు
నిజ సమాధికి

జలమే నయమేమో
డబ్బుకంటే
పేగునిండా తాగితే
తృప్తి కదా

పట్టపగలే
చిమ్మచీకటి
ఆలోచనను బట్టేగా
లోచనం...!

పుంతలు డొంకలు
ఎక్కడనా...?
పొలిమేరలు కాదు
కౌగిళ్ళల్లో వెతకండి

అవయవాల కుప్ప
పంజగుట్ట
నగరం నుదిటిపై
నెత్తుటి "ఓవర్"ఫ్లో

గ్లిజరిన్ నీళ్ళు
కానేకాదు
అవి నిజంగా
అచ్చమైన కన్నీళ్ళు

భయకంపిత
కల్వర్టు
వి.ఐ.పి. పర్యటన
ఖరారయిందేమో...!

బొచ్చుకుక్కల్ని
ప్రేమిస్తావు సరే
కాస్త
మనుషుల్ని కూడా గుర్తుంచుకో

ఎక్కడ చూసినా
జనం జనం
అనుబంధాల్లో
ప్రభంజనం

అ"హింసా" పరమోధర్మః
వెండితెరపై
ఇంద్ర, ఆది
సమరసింహారెడ్డి

బోన్సాయ్ వృక్షాలను
సాకుతావు
సరే
మనసును మరుగుజ్జు కానివ్వకు

శాంతికి స్ఫూర్తి
మానవ హారం
మనసు మూలల్లో
శాపనార్థాలు

నీళ్ళకీ... కన్నీళ్ళకీ
కొదువ లేదు
మత్స్యకారుడే
గాలానికి చిక్కాడు

అతడు
మహనీయుడే
ఇంకా
"మనిషి"గానే మిగిలున్నాడు కనుక

స్టోన్‌క్రషర్‌లో పగిలేది
రాళ్ళేకాదు
రప్పలయిన
జీవితాలు కూడా

వారం రోజులుగా
ఒకటే ముసురు
సూరీడు
ఇవాల్టి ఛీఫ్‌గెస్ట్

ధగధగా మెరిసే
తెల్ల డ్రస్
అధికారి కనుసన్నలే
అతని అడ్రస్

బిరబిరా కృష్ణమ్మకి
దప్పికా
ఇదిగో
జలజలా వాటర్ బాటిల్

రంగుల పంజరంలో
రగిలే పక్షులు
సీరియళ్ళ మధ్య కుమిలే
వీక్షకులు

మెయిల్ ఎట్
బెగ్గర్ @ ఎ.పి. డాట్‌కామ్
ధర్మం
చెయ్యండి బాబూ

కన్నీరు
అతనికి అలవాటే
రప్పించడమే
అతడి రూటు

తిరగలి మధ్య
నలిగే గింజలు
పేగు మాడి
విలవిల్లాడే పిందెలు

విగ్రహాల స్థాపనకీ
నిగ్రహానికీ
నడుమ
ఎడం వుంటే బావుండు..!?

చీకటి మెట్లపై
బాలిక
దారిచూపుతూ
చేతిలో పుస్తకం

మనుషుల్నీ దాస్తాడు
"కోల్డ్" స్టోరేజిలో
అచ్చమైన వ్యాపారి అంటే
అతడే

ప్రపంచంలో
అతి వేగంగా
మాయం కాగలిగిన
"మాంత్రికుడు"...!?

ఎవర్నీ నమ్మడు
ఎప్పుడూ...
గాలిని కూడా
'టెస్ట్' చేసి పీలుస్తాడు

బాల్యమిత్రుడిని
చూద్దామని వెళ్ళా
అక్కడ
అకాల వృద్ధాప్యం

'హలో'
మింగేసిన ఉత్తరాక్షరాలు
ఇంతే సంగతులు
చిత్తగించవలెను

అన్నదాత కమతంలోకి
కొత్తసభ్యుడు
ముడ్రాగేదె
ఈనింది

పొలిగట్టే చేటా ఎందుకు
గాదే వట్టిపోయాక
ఇక గాలి కూడ
గుదిబండే

మంచమే కాదు
రైతుకు అన్నం పెట్టే కంచం కూడా
పంట చేలో
మంచె

ఎప్పటిలాగే
కళ్ళల్లో కళ్ళుపెట్టి చూశాడు
ఈసారి మాత్రం
కలక...!?!

ఆకాశంలో
అందమైన అల్లిక
ముచ్చటైనదీ
పక్షుల స్వేచ్ఛావిహారం

చెట్టు మాయమై
కాంక్రీటు వనం
మమతలు అదృశ్యమై
పాషాణ హృదయం

శ్రవణ నాడులకే
సెల్‌ఫోన్
హృదయతంత్రులు
పనిచేయవు


తాజాదనం
నిర్వచనం మారింది
ఫ్రిజ్‌లో పండ్లే
ఇప్పుడు "ఫ్రెష్"

దృశ్యానికి
అదృశ్యానికి
నడుమ
అక్షర గవాక్షమేగా

తిమిరంతో
సమరం చేస్తావా
అయితే
ముందుగా నీతో నువ్వు

కృష్ణపక్షమా
శుక్లపక్షమా
స్థితప్రజ్ఞుడికి
తేడా వుండదు

ఆనందం
అర్ణవమయితే
అభిమానం
మరి సువర్ణమేగా



సోమేపల్లి వెంకటసుబ్బయ్య

ఎవర్నీ నమ్మడు
ఎప్పుడూ...
గాలిని కూడా
'టెస్ట్' చేసి పీలుస్తాడు

గుండ్రంగా మేసి
వృత్తం గీసింది
బీడులో కట్టేసిన గేదెదే
కళాహృదయం...!

దారి పొడుగునా
టోల్‌గేట్లు
దాటాలంటే
కావాల్సిందే బిల్‌గేట్స్

తాజాదనం
నిర్వచనం మారింది
ఫ్రిజ్‌లో పండ్లే
ఇప్పుడు "ఫ్రెష్"

RATNA - VJA
© 0866 - 6663666